ద్రోహి

సుజనశ్రీ

"నాయర్!" పద్మనాభన్ కేకకు మెస్ అంతా అదిరి పడ్డారు.

సన్నగా ఉన్న నాయర్ పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"ఏం సార్!" అన్నాడు వినయంగా.

పద్మనాభన్ అతడి వంక ఉరిమి చూశాడు. ఖడ్గ మృగం పరిమాణంలో ఉన్న పద్మనాభన్ ముందు నాయర్, పులిముందు నిలబడ్డ నక్కలాగ ఉన్నాడు.

"నీ వంట రోజురోజుకూ ఇలా తగలడుతోందేం? ఇది మనుష్యులు తినేదేనా! పందులు తినేదా?"

"తమరు కోపంలో ఉన్నారు. అందరూ ఈ రోజు వంటకాలు బాగున్నాయని మెచ్చుకున్నారు సార్!"

నసుగుతూన్నట్టుగా బదులు చెప్పాడు నాయర్.

"అంటే నేను అబద్ధం చెబుతున్నాననేగా? ఈ పద్మనాభన్‌కి ఎదురు చెప్పేందుకు నీ కెన్ని గుండెలు?" అంటూ పద్మనాభన్ తన ముందున్న ప్లేట్‌ని తీసి నాయర్ మీదకు విసిరేశాడు.

అది ముందే ఊహించిన నాయర్ తటాలున క్రిందకు వంగాడు.

ప్లేట్ గాలిలో గిరగిర తిరుగుతూ వెళ్ళి అవతల వరుసలో కూర్చుని భోజనాలు చేస్తున్న వారిలో ఒక నావికుడికి వెళ్ళి కొట్టుకుంది.

ఆ నావికుడు కొరకొర పద్మనాభన్ వంక చూశాడు. ప్లేట్‌లోని ఎంగిలి పదార్థాలు చెల్లాచెదురుగా ఇతరుల ప్లేట్‌లో పడ్డాయి. వారందరూ పద్మనాభం వంక చూశారు గుర్రుగా.

అయితే అందులో ఎవరికీ పద్మనాభన్‌ని ఎదుర్కొనే ధైర్యం లేదు.

పద్మనాభన్ ఆరడుగుల ఎత్తూ, ఉక్కు కడ్డీల్లా మెలి తిరిగిన కండరాలతో ఎనుబోతులా గుంటాడు. అతడు మంచి బాక్సర్ గూడ! మల్లయుద్ధంలో అనేక ప్రైజుల్ని గెలుచుకున్నవాడు. అతడు నావికాదళంలో చేరాడు.

ప్రస్తుతం నావ "జలపుష్ప" కెప్టెన్ ఛటర్జీకి బాక్సర్స్ అంటే మహా ఇష్టం! అందుకే కండబలం తప్ప మరో ప్రజ్ఞ లేని పద్మనాభం త్వరలోనే ఛటర్జీకి చాల సన్నిహితుడైనాడు.

కెప్టెన్ ఆసరా చూసుకుని పద్మనాభం అతిగా ప్రవర్తిస్తుంటాడు. అతడి చేతిలో దెబ్బలు తినని నావికులు, ఆ ఓడలో అయిదారుగురికన్న ఎక్కువ ఉండరు!

అందరికీ అతడంటే చెప్పలేనంత ద్వేషం. ఎవడైనా ధీరుడు ఊడిపడి పద్మనాభం పొగరు అణిస్తే బాగుండునని ఎవరికివారే లోలోపల ఉవ్విళ్ళూరుతుంటారు.

పద్మనాభం తను కూర్చున్న చోటునుంచి లేచాడు. నాయర్ దగ్గరకు వెళ్ళాడు. అతడి చొక్కా కాలరుపట్టుకుని నిటారుగా లాగాడు. పిడికిలి బిగించి నాయర్ గుండెల్లో గుద్దాడు.

"అమ్మో!" అని అరిచాడు నాయర్ మెలికలు తిరిగి పోతూ.

పద్మనాభం వికటంగా నవ్వాడు. మరో గుద్దుపడింది. నాయర్ నోటంట రక్తం పడింది.

అందరూ ఆత్రంగా లేచి అతడి చుట్టూ మూగారు. అయినా పద్మనాభం తగ్గలేదు. అతడి పిడికిలి మరోసారి పైకి లేచింది.

ఈ తడవ దెబ్బ పడితే నాయర్ ప్రాణాలొదలటం ఖాయమనుకున్నారు అందరూ. ఏమవుతుందా అని ఊపిరి బిగబట్టుకుని చూస్తున్నారు.

"పద్మనాభం! మరో దెబ్బ పడిందో నీ అంతు నేను చూసి తీరతాను!" ఎవరో అరిచారు.

పద్మనాభం ఎత్తిన చేయి ఎత్తినట్టుగానే వుండిపోయింది.

అంతా ఆ కంఠం మ్రోగిన దిక్కై చూశారు. ఆ మాటలు అన్నది ఎవరో కాదు! జాన్సన్!

జాన్సన్ కూడా మంచి ఆజానుబాహువే, కానీ పద్మనాభంకి సరి అయిన ఉజ్జీ మాత్రం కాదు!

జాన్సన్ మితభాషి, మంచి నడవడి కలవాడు. కెప్టెన్ కి

అతడంటే గౌరవం ఉంది. పద్మనాభం చేయి ఏనాడూ జాన్సన్ ఒంటిమీద పడలేదు.

పద్మనాభం నిప్పులు గ్రక్కే కళ్ళతో జాన్సన్ వంక చూసి, మళ్ళీ తల త్రిప్పుకున్నాడు.

"నీ నక్కజిత్తులు నా దగ్గర కాదు నాయర్! లేచి వెళ్ళి వాళ్ళందరికీ తిరిగి వడ్డించు. సగం తినేకంచాల్లో నా ఎంగిలి పడింది, నీ మూలంగా!" అంటూ కీవిగా క్యాబిన్ వేపు అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు పద్మనాభం.

నాయర్ని లేపి ఒక బెంచీ మీద పడుకోబెట్టారు. నీళ్ళు త్రాగించాక కొద్దిగా తేరుకున్నాడు నాయర్!

అందరూ జాన్సన్ని అభినందించసాగారు.

"మీరు కలుగజేసుకోకపోతే ఇవాళ నాయర్ చచ్చిపోయి ఉండేవాడు!" అన్నారు కొందరు.

"వాడికెంత కావరం! వాడి పొగరణిగే రోజు ఎప్పుడు వస్తుందో ఏమో?" మరెవరో అన్నారు.

నాయర్ చాల నీరసంగా ఉన్నాడు. అతడ్ని వేరే రూమ్లోకి తీసుకెళ్ళి డాక్టర్కి కబురు పెట్టారు.

మరో వంటవాడు, బట్లర్ వచ్చి, మళ్ళీ నావికులకు భోజనం వడ్డించసాగారు.

2

ఆకాశంలో చంద్రుడు విహరిస్తున్నాడు తారకల మధ్యగా. భారత నౌకాదళానికి చెందిన నౌక "జల పుష్ప" కొచ్చిన్ రేవుని వదిలి బంగాళాఖాతంలో ప్రయాణిస్తున్నది.

బంగ్లాదేశ్లో ముజీబుర్ రెహమాన్ నాయకత్వంలో మొదలైన అంతర్యుద్ధానికి మద్దత్తుగా భారత్ సైన్యాలు

ఢాకాని చక్రబంధంలో ఇరికించినయ్. ఢాకాలో పాకిస్తాన్ సైన్యాలు లొంగిపోవటానికి ఇరవయ్ నాలుగు గంటలు టైమ్ ఇవ్వబడింది.

ఇంతలో అమెరికా సప్తమ నౌకాదళం, సెవెన్త్ ఫ్లీట్ పాకిస్తాన్‌కి సాయపడే నెపంతో హిందూ మహా సముద్రం వైపుగా ప్రయాణిస్తున్నట్టు వార్త లందాయి.

సప్తమ నౌకాదళం భారతదేశాన్ని చేరుకోకముందే, ఢాకాని వశపరుచుకుని, యుద్ధం సమాప్తి చేసి, శాంతిని ప్రకటించాలని భారత ప్రభుత్వం ఉద్దేశ్యం. ఈ లోపల ఢాకాని చుట్టుముట్టిన భారత సైన్యపు టాంక్‌లకు కొన్ని ముఖ్యభాగాలు అవసరమైనయ్.

ఆ ముఖ్య భాగాలను, మరికొంత అమ్యూనిషన్ ఆయుధ సామగ్రిని సముద్రం మీదుగా బంగ్లాదేశ్ పంపవలసి వచ్చింది. వాటన్నిటినీ మూడు భాగాలుగా విభజించి, మూడు నౌకల ద్వారా రవాణా చేయదలిచింది ప్రభుత్వం!

పాకిస్తాన్ విమానాలు కరాచీలో బయలుదేరి శ్రీలంక చేరుకుని, అక్కడనుంచి బంగ్లాదేశ్ చేరుకుని బాంబులు వేస్తూ వచ్చాయ్. కనుక తాము పంపదలచుకున్న సామగ్రిని ఒకే నౌకలో రవాణా చేస్తే, ఆ నౌకను పాక్ విమానాలు ముంచివేసే ప్రమాదం ఉంది. అందుకే విడివిడిగా మూడు నౌకల్లో పంపుతున్నారు.

అలా బయలుదేరిన నౌకల్లో రెండోది జలపుష్ప! మూడురోజుల క్రితమే మొదటి నౌక బయలుదేరి వెళ్ళిపోయింది.

"జలపుష్ప" డెక్ మీద రెయిలింగ్స్ కానుకుని నిలబడి సిగరెట్ కాలుస్తున్నాడు జాన్సన్.

రాజు కూడ అతడివద్దకు చేరుకున్నాడు.

జాన్సన్ ఇంకా కోపంగా ఉన్నాడని తెలుసుకున్నాడు రాజు. తనూ సిగరెట్ వెలిగించాడు. వారిద్దరిమధ్యా కొద్ది సేపు మౌనం తాండవించింది.

"ఆ పద్మనాభంగాడికి నా చేతుల్లో త్వరలోనే చావు రానిపెట్టి ఉంది!" అన్నాడు జాన్సన్ నెమ్మదిగా.

"నాయర్ అంటే నీ కెందుకంత ఇది? అతడు నీకేమైనా బంధువా?" రాజు అడిగాడు.

"జీవితంలో బంధువులకన్న మిత్రులే ఆ ప్తులౌతుంటారు? నీవెంతవరకు నాకు బంధువో, నాయర్ కూడా అంతే బంధువు!" అన్నాడు జాన్సన్.

జాన్సన్ అంటే రాజుకి ఎంతో అభిమానం! రాజు అంటే జాన్సన్ కి ఆరో ప్రాణం. ఇద్దరూ అంత సన్నిహితులు. ఇద్దరూ కాస్సేపు పిచ్చాపాటి మాట్లాడుకొని లోపలికి నడిచారు.

3

మర్నాడు మెస్ లో నాయర్ ఒక పక్కగా కూచుని తన స్థానంలో వచ్చిన బట్లర్ కి సూచనలిస్తున్నాడు.

అతడు మనిషి తెల్లగా పాలిపోయాడు. ఎన్నో నెలల తరబడి జబ్బుగా ఉండి, అప్పుడే కోలుకున్న మనిషిలా కనుపించాడు.

"హాయిగా వెళ్ళి రెస్ట్ తీసుకోకూడదూ, ఇక్కడ పని చేసి అలసిపోకపోతే?" అనడిగాడు రాజు.

"బెడ్ లో పడుకుంటే అసలు తోచటం లేదండీ! అందుకే వచ్చి ఇక్కడ కూర్చున్నాను. తిరిగే కాలూ, నాగే నోరూ ఊరికే ఉండలేవని గదా సామెత!" అంటూ

నవ్వాడు నాయర్, యూనిఫారం కాలర్ సాగదీసు కుంటూ.

రాజు, జాన్సన్ భోజనం చేస్తున్నారు. నాయర్ నోరు మూత పడకుండా వాగుతూనే వున్నాడు.

"రాజూ! నీళ్ళందుకో!" అని అరిచాడు జాన్సన్, మెలికలు తిరుగుతున్న నాయర్‌ని పొదివి పట్టుకుని.

రాజు లోటాలో నీళ్ళందించాడు. నాయర్ నీళ్ళు త్రాగాడు. దగ్గు కొద్దిగా సద్దుకుంది.

పద్మనాభం అప్పుడే మెస్‌లోకి అడుగు పెట్టాడు.

"ఆ టీ. బీ. పేషెంట్‌ని శవాల గదిలో పారేయక ఇక్కడెందుకుంచారు! ఒరేయ్! నీ మూలంగా ఆ వ్యాధి అందరికీ అంటిస్తావురా! ఇక్కడ నుంచి బయటకు తగ లడు!" అని అరిచాడు పద్మనాభం.

నాయర్‌ని వదిలేసి, జాన్సన్ పులిలా పద్మనాభన్ మీదకు దూకాడు.

పద్మనాభన్ పీక పుచ్చుకుని అటూ ఇటూ కుదించే శాడు జాన్సన్.

పద్మనాభం పిడికిలి బిగించి జాన్సన్ పొట్టలో గుద్దాడు. జాన్సను చేతులు విడిపోయినయ్. క్రింద పడిపోకుండా నిలదొక్కుకున్నాడు జాన్సన్. తన కుడికాలుతో బలంగా పద్మనాభం గడ్డంక్రింద తన్నాడు.

పద్మనాభం కూర్చున్న చోటినుంచి వెనక్కు పడి పోయాడు.

జాన్సన్ నాయర్‌ని పసిపిల్లవాడిలా ఎత్తుకుని మెడికల్ రూమ్‌లోకి తీసుకుపోయాడు. బెడ్ మీద పడుకోబెట్టి అతడా స్థితికి ఎలా వచ్చిందీ క్లుప్తంగా విశదపరిచాడు డాక్టర్‌కి.

డాక్టర్ ట్రీట్‌మెంట్ ఇచ్చాక నాయర్ సుఖనిద్ర లోకి జారుకున్నాడు,

ఆ రోజల్లా జాన్సన్ నాయర్ ప్రక్కనే కూర్చుని అతడ్ని కనిపెట్టుకుని వున్నాడు.

రాజు లెఫ్టినెంట్‌ని కలుసుకున్నాడు. నాయర్‌ని కని పెట్టుకుని వుండటానికి జాన్సన్‌కి అనుమతి తెచ్చాడు.

మధ్యాహ్నం మూడుగంటలు కావస్తున్నది. జలపుష్ప నౌక వేగంగా ప్రయాణిస్తున్నది, తన గమనం వేపు! ఏ ఆటంకమూ లేకుండా వుంటే, మరో ముప్ఫయిగంటల్లో నౌక చిట్టగాంగ్ చేరుకుంటుంది.

నాయర్ స్పృహలేని స్థితిలో ఇంకా బెడ్‌మీదనే వున్నాడు. అతడ్ని కనిబెట్టుకుని జాన్సన్ అతడి ప్రక్కనే కూర్చున్నాడు. రాజు మరో ప్రక్క వున్నాడు.

4

నౌకలో సైరన్ మ్రోగింది. ఎవరైనా శత్రువులు వెంటాడుతున్నా లేక దాడికి వస్తున్నా మ్రోగే అలారం అది.

రాజు ఆశ్చర్యంగా, భయంగా జాన్సన్ ముఖంలోకి చూశాడు.

"సైరన్ మ్రోగుతోంది. అంటే అందరూ తమ ఆయుధాలు తీసుకుని కెప్టెన్ ముందుకెళ్ళాలన్నమాట! లే జాన్సన్! పద పోదాం!"

"నేను రాను! నాయర్‌ని కనిబెట్టుకుని ఇక్కడే వుంటాను! నీవు వెళ్ళు రాజూ!"

"నీకేం మతి చెడిందా? నీవిక్కడే కదలకుండా వుంటే, పై అధికార్లను తిరస్కరించినట్టవుతుంది

తెలుసా?'' కొన్ని విషయాల్లో జాన్సన్‌ది మొండిపట్టు అని రాజుకి బాగా తెలుసు!

''తర్వాత ఏమన్నా అవనీ! నీవు వెళ్ళిపో! నా గురించి నీవు ఆగద్దు!'' జాన్సన్ మొండిగా అన్నాడు.

రాజు మెషీన్‌గన్ చేతబుచ్చుకుని డెక్‌మీదకు పరుగెత్తాడు.

అప్పటికే డెక్‌మీద కోలాహలంగా వుంది. మెషిన్ గన్స్ పుచ్చుకుని నావికులు పొజిషన్స్‌లోకి వెళ్తున్నారు. కెప్టెన్ గొంతు చించుకుని అరుస్తున్నాడు.

ఇద్దరు ముగ్గురు సైనికులు స్టీరింగ్‌వీల్ దగ్గర నిలబడి వున్నారు.

డెక్ చివరగా, రెయిల్స్ దగ్గరకు వెళ్ళాడు రాజు. అతడికి ప్రక్కగా నిలబడివున్న మైత్రా ఆకాశంలోకి చూస్తున్నాడు.

''అమెరికన్ ఫాంటమ్ ఫైటర్స్ అవి! నాలుగు వచ్చినయ్!'' అన్నాడు మైత్రా.

నౌకకు మూడుమైళ్ళ రేంజ్‌లో, శవంచుట్టూ తిరుగాడే గద్దల్లా, నాలుగు విమానాలు ప్రదక్షిణం చేస్తున్నయ్. అవి ఏ క్షణాన అయినా నౌకమీదకు బాంబుల వర్షాన్ని కురిపించేలా వున్నయ్. నౌకలోని ప్రేలుళ్ళకు దూరంగా తప్పించుకుని తగు జాగ్రత్తలోనే ప్రదక్షిణం చేస్తున్నయ్ విమానాలు.

అవి ఎప్పుడు రేంజ్‌లోకి వస్తాయా, ఎప్పుడు కాలుద్దామా అని సైనికులు కాచుకుని వున్నారు.

విమానాలు ఎటు మళ్ళితే నావికుల తలలూ అటే తిరుగుతున్నయ్.

కెప్టెన్ చ్యాయింగ్ గమ్ నమలుతూ విమానాలవంక కోపంగా, గుర్రుగా చూస్తున్నాడు.

ఆ విమానాలు ఒక్కుమ్మడిగా దాడి చేయవేం? ఎందుకలా తీరిగ్గా చుట్టూ తిరుగుతాయ్. వాటిల్లోని బాంబుల్ని తల్చుకుంటేనే రాజుకు కంపరం కలుగుతోంది. నాలుగు శత్రువిమానాలు! నాలుగూ ఒక్కసారే విజృంభించి నౌకను ముంచేస్తే?

"మనమీదకు రారేం వాళ్ళు?" రాజు అసహనంగా అడిగాడు.

ప్రక్కనే వున్న మైత్రా నవ్వాడు వేదాంతిలా!

"పిల్లికి చెలగాటం! ఎలుకకు ప్రాణసంకటం! ఆ విమానాల్ని తప్పించుకుని మన షిప్ పోలేదని వాళ్ళ ధైర్యం! మన మనోనిగ్రహాన్ని, గుండెనిబ్బరాన్ని చీల దీసేందుకు వాళ్ళు తమ బలప్రదర్శన చేస్తున్నారు!" మైత్రా చెప్పాడు.

అంటే వాళ్ళు తమతో చెలగాట మాడుతున్నారన్న మాట! రాక్షసులు! ఉద్వేగంతో, ఆవేశంతో తాము వణికిపోయేలా చేయాలని వాళ్ళ ఉద్దేశ్యం. ఆ విమానాల రొదతో తమకు పిచ్చెక్కేలా చేద్దామని వాళ్ళ ఊహా?

తనకు ఆహారంగా దొరికిన జంతువుని సగం సగం చంపి, నింపాదిగా తినబోయే క్రూరమృగంలా, వాళ్ళు తమ చుట్టూ తారట్లాడుతున్నారు అనుకున్నాడు రాజు. ఆలస్యమవుతున్నకొద్దీ అతడికి చెమటలు క్రమ్మసాగింది.

వలయాకారంలోంచి ఒక విమానం మళ్ళింది. పది హేను వందల అడుగుల దూరంలో, నలభై ఐదు డిగ్రీల కోణంలో దూసుకువస్తోంది ఆ విమానం, నౌకమీదకు.

బహుశా నావికుల ఫైరింగ్ రేంజ్‌ని పరీక్షించటానికేమో!

విమానంలోంచి గుండ్లవర్షం కురుస్తోంది. మొదట కొన్ని సముద్రంలో పడినయ్. విమానం నాకమీదుగా సర్రున దూసుకుపోయింది. గుండ్లు నాకమీద పడలేదు.

నాకలోంచి మిషిన్‌గన్స్ గర్జించినయ్. కాని అవి విమానాన్ని తాకలేకపోయినయ్.

రెండో విమానం దూసుకువస్తోంది మళ్ళీ! దాంట్లోంచి చిన్నసైజు బాంబులు ధారగా పడుతున్నయ్.

పైలట్లు స్టీరింగ్ వీల్‌ని గిరగిర త్రిప్పుతున్నారు. నాక గమనం మళ్ళింది.

విమానంలోంచి పడుతున్న బాంబులు నీళ్ళ పాలయినయ్. విమానం వెళ్ళిపోయింది.

నీళ్ళలో బాంబులు పడేసరికి, నీళ్ళు నాకకు ఇంతా అంత ఎత్తున లేచిపడ్డయ్. ఆ కల్లోలానికి రేగిన అలల్లో నాక అటూ ఇటూ ఊగిసలాడింది.

డెక్ మీద సైనికుల్లో కొందరు పడిపోయారు, మరి కొందరు అటూ ఇటూ స్థానాలు మారారు.

మూడో విమానం నాకమీదకు వస్తోంది. అయితే ఈసారి విమానం చాలాదూరంలో ఉండంగానే నాకలోంచి ఒక్కుమ్మడిగా కాల్పులు జరిగినయ్.

ఆ దెబ్బకు ఆ విమానం ఆత్మరక్షణకోసం తన గమనాన్ని మళ్ళించుకుని దూరంగా వెళ్ళిపోయింది.

ఈ దఫా నాలుగోవిమానం వస్తోంది, మొదటివిమానం అప్పుడే ఒక రౌండ్ కొట్టి, దాంతోబాటే వస్తున్నది. ఒక్కసారే రెండు విమానాలు దాడి జరపడానికి వస్తున్నయ్.

"కుడివేపువారంతా ఒక విమానాన్ని, ఎడమవైపు వారంతా రెండోదాన్ని ఎదుర్కోండి!" అని అరిచాడు కెప్టెన్!

మొదటి విమానం వస్తున్నవైపే వున్నాడు రాజు. విమానంలోంచి వస్తున్న కాల్పుల్ని లక్ష్యపెట్టకుండా, తన గన్‌ని విమానంకేసే గురిపెట్టాడు. విమాన గమనంతో బాటు అతడి గన్ కూడా తిరుగుతోంది.

ధన్ ధన్ ధన్ మని రాజుచేతిలో మెషిన్‌గన్ విరామం లేకుండా ప్రేలింది. అతడి సాహసం ఫలించింది.

విమానంకి నిప్పంటుకుంది. నల్లని పొగను చిమ్ముతూ విమానం ముందుకుపోయింది. దెబ్బతిన్న పక్షిలా సముద్రంలో కూలిపోయింది.

"సెభాష్ రాజూ!" కెప్టెన్ కంఠం పెద్దగా వినిపించింది.

అంతలోనే నౌక అంతా ఒక్కసారే దద్దరిల్లింది. నాలుగో విమానంలోంచి దిగిన బాంబులు కొన్ని నౌకలో పడినయ్. పెద్దగా శబ్దంచేస్తూ అవి ప్రేలడమూ, ఆవైపు నౌకలో పెద్దపెద్ద చిల్లులు పడటమూ జరిగింది. అంతే కాదు. ఆ వైపున వున్న నావికులు ప్రాణాలు కోల్పోయి డెక్ నేలను కరుచుకుని వున్నారు.

వాళ్ళ శరీరాలనిండా తూట్లు పడినయ్! కొందరికి కాళ్ళూ, చేతులూ విరిగిపోయాయ్!

రాజు శరీరం గడ్డకట్టుకు పోయింది. తనా ప్లేన్‌ని కాల్చలేకపోయినట్టయితే, తనకీ అదే గతి పట్టివుండేది.

రాజు మళ్ళీ ఆకాశంలోకి చూశాడు. ఈ దఫాగూడా ఇంకో రెండు ప్లేన్‌లు వస్తున్నయ్. నౌక గమనాన్ని

మార్చినా, తప్పించుకోటానికి వీల్లేకుండా చెరో ప్రక్క-నుంచి దూసుకువస్తున్నయ్!

నౌక గమనాన్ని మార్చకుండా సూటిగా ముందుకు పోతోంది. విమానంలోంచి బుల్లెట్స్ వచ్చి నౌకలో పడుతున్నయ్. అవి తగిలిన మనుష్యులు నేల కూలుతున్నారు. డెక్ మీద పడ్డ బుల్లెట్స్ దెబ్బకి చిల్లులు పడుతున్నయ్.

విమానాలు నౌకమీదకు రాబోతూండగానే, పైనుంచి బాంబులు పడసాగినయ్. ఒక వరుస డెక్ ఎడమభాగాన్ని కోసుకుపోతున్నాయ్. రెండోవరుస మరికొందర్ని బలి తీసుకుంది.

నౌక నీళ్ళలో ఎగసిపడింది. నౌక ముందుభాగంలో నీళ్ళలో ఉత్పాదన రేగింది. నౌకకంటె ఉవ్వెత్తుగా నీళ్లు పైకి లేచి మళ్ళీ పడిపోయాయి.

నౌకలో ఇంజన్ల మ్రోత ఆగిపోయింది. అందరికీ గుండె లాగిపోయినంత పనయింది. నౌక పని అయిపోయింది. అది యుద్ధానికి ఉద్దేశించిన నౌక కాదు. అందుకే తేలికగా దాని పని అయిపోయింది.

అందరూ దిగ్భ్రాంతులై చూస్తుంటే, రాజు, మైత్రా ఇద్దరూ తమకు దూరంగా వెళ్తోన్న విమానాలవైపుగా కాల్పులు సాగించారు.

ఆ రెండూ విమానాలు క్రమేపీ ఎత్తునించి దిగజారి సముద్రంలో పడిపోయినయ్. బురదలో పడుకుని మునిగిపోయే పందుల్లా నీళ్ళల్లో మునిగిపోయినయ్.

నాలుగో విమానం పలాయనం చిత్తగించింది.

5

"అందరూ లైఫ్ బెల్ట్స్ తగిలించుకోండి! ఓడ మునిగిపోతోంది!" కెప్టెన్ అరిచాడు మూడు నాలుగుసార్లు!

డెక్ నిండా బ్రతికున్న వారికంటె ఎక్కువ సంఖ్యలో శవాలు పడిఉన్నాయ్.

డెక్ మీద నావికులంతా మెషీన్ గన్స్‌ని వదిలేసి బోట్లను నీళ్ళ మీదకు దించే ప్రయత్నంలో మునిగి పోయారు.

ముందుగా పెద్ద సైజు మోటార్ బోటుని నీళ్ళల్లోకిజార విడిచారు. మంచి నీటి పీపాని దించారు తర్వాత. సముద్రం మీద ప్రయాణించేటప్పుడు ఆహారం లేకపోయినా ఎలాగో ఉండవచ్చు. కాని మంచి నీళ్ళు లేకపోతే మనుష్యులు బ్రతకలేరని నావికులకందరకూ ఉగ్గుబాలతో నేర్పిన విద్య!

మరోచిన్న బోటుని దింపారు. దాంట్లో మరో డ్రమ్ము త్రాగే నీటిని ఎక్కించారు. ఆ తర్వాత ఆహార పదార్థాలు రొట్టె, వెన్న, బీఫ్ ప్యాకెట్లూ,టిన్నులు తీసుకుని కొందరు బోట్లలోకి దిగారు.

జాన్సన్ సంగతి అప్పటికిగానీ గుర్తురాలేదు రాజుకు. కెప్టెన్ అరుస్తూన్నా వినకుండా, మెట్లుదిగి కాబిన్ గదు ల్లోకి పరుగెత్తాడు.

నాయర్ కళ్ళు తెరుచుకుని నిశ్చింతగా పడుకుని ఉన్నాడు. అతడిలో చలనం లేదు.

అతడి ముఖం మీదకు వంగి చూస్తున్నాడు జాన్సన్.

"జాన్సన్! నాయర్‌ని భుజాన వేసుకుని పరుగెత్తు! ఓడ మునిగిపోతోంది!" రాజు ఆదుర్దాగా అరిచాడు.

"నాయర్ చనిపోయాడు!" అంటూ జాన్సన్ దుప్పటి లాగి అతడి మీదుగా కప్పాడు పూర్తిగా.

రాజు వెనకనే నడుస్తూ డెక్ మీదకు వచ్చాడు. త్రాటి నిచ్చెన మీదుగా ఇద్దరూ దిగి రెండో పడవలోకి దిగారు.

మోటార్ బోటుకీ రెండో పడవకీ పెద్ద త్రాడుతో ముడివేశారు. మోటార్ బోట్ స్టార్ట్ అయింది, రెండో పడవను లాక్కెళుతూ.

మోటార్ బోటులో కెప్టెన్, ఇంకా పదిమంది నావికు లున్నారు. వాళ్ళలో పద్మనాభం కూడా ఉన్నాడు.

అతడు నవ్వుతూ కెప్టెన్‌తో కబుర్లు చెపుతున్నాడు. అతిభయానకమైన దాడికి గురై, ఓడ మునిగిపోయి, ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని అందరూ బిక్క మొగా లతో కూర్చుంటే, పద్మనాభంకి ఇదేం పట్టినట్టు లేదు! ఏదో పిక్నిక్‌కి వెళ్తున్నవాడిలా నవ్వుతూ మాట్లాడుతున్నాడు.

మహాసముద్రం మీద పడవలో ప్రయాణం అంటే మాటలు కాదు. తుఫాను వీచిందంటే, సుడిగాలిలో ఆకులాపడవ అల్లలాడిపోతుంది. అందులోని మనుషులు తలా ఒకదిక్కై అడ్రసు లేకుండా పోతారు.

అంతేకాదు. ఇంకో ప్రమాదం కూడా ఉంది. మూడు విమానాలు కూలిపోగా, నాలుగో విమానం పలాయనం చిత్తగించింది. అది మరికొన్ని విమానాల్ని వెంటపెట్టుకుని తిరిగి దాడి జరిపేందుకు రావచ్చు ఏ క్షణంలోనైనా?

నౌక క్రమేపీ నీళ్ళలోకి దిగిపోయింది. నీటి ఉపరితలం మీద ఇంకా మాస్ట్ మీది జెండా కనబడుతూనే వుంది.

వందగజాల దూరంలో ఆగి బోటుల్లో కూర్చుని నౌక పూర్తిగా మునిగిపోవటాన్ని కళ్ళారా చూసి, తర్వాత అందరూ బయలుదేరారు.

6

మోటార్ బోట్‌లో అందర్నీ సమావేశపరచి కెప్టెన్ ఏదో చర్చిస్తున్నాడు.

"మనకంటె ముందు వెళ్ళిన నౌక సురక్షితంగా గమ్యాన్ని చేరుకుంది. కానీ శత్రువిమానాలు మన ఉనికిని పసిగట్టాయంటే, ఎవరో శత్రుదేశపు గూఢచారులే మన కదలికల్ని తెలియజేసి వుండాలి. లేదా మనలోనే ఎవరో రహస్య సమాచారాన్ని చేరవేసి వుండాలి" అన్నాడు కెప్టెన్.

"అందుకు సందేహం లేదు సార్! మనలోనే ఒకరు శత్రుదేశానికి సమాచారాన్ని అందించారు. అందుకు సాక్ష్యం ఈ ట్రాన్స్మిటరే! ఇది చైనా తయారీ!" అంటూ పద్మనాభం ట్రాన్సిస్టర్ సైజులో ట్రాన్స్మిటర్ అందరి మధ్యలో ఉంచాడు.

"ఎక్కడ దొరికింది ఇది?" అందరూ ఆశ్చర్యంగా అడిగారు.

"ఇంకెక్కడ? జాన్సన్ గదిలోనే దొరికింది!" కొందరు నావికులు జాన్సన్ వంక చూసి పళ్ళు కొరికారు. మరికొందరు జాన్సన్‌ని అక్కడికక్కడే కాల్చి చంపుతామని మెషీన్ గన్స్ తీశారు.

వాళ్ళను కెప్టెన్ వారించాడు. "తీరం చేరంగానే, అతడ్ని కోర్ట్ మార్షల్‌లో విచారిస్తాం! మీరు ఆవేశపడి హంతకులు కాకండి!" అన్నాడు.

"జాన్సన్!" అని అరిచాడు కెప్టెన్.

"యస్ సార్!" జాన్సన్ పడవ అంచుకు వెళ్ళి నిలబడ్డాడు.

"ఈ రహస్య ట్రాన్స్మిటర్ నీ గదిలో దొరికింది! దీని ద్వారా నీవే శత్రువులకు మన నౌక గురించి సమాచారం అందించావని నీపై ఆరోపణ చేయబడింది. దీనికి నీ సమాధానం ఏమిటి?"

జాన్సన్ నోటంట మాట రాలేదు! ఒక్క క్షణం అలానే చూస్తూ నిలబడి పోయాడు.

"ఎవరు తీశారు నా గదిలోంచి దాన్ని?" అనడిగాడు చివరకు.

"పద్మనాభం!"

"వాడే శత్రుదేశానికి సమాచారం అందించాడు. నాకూ వాడికీ మధ్య వైరాన్ని పురస్కరించుకుని, తను చేసిన ద్రోహాన్ని నా మీదకు నెడుతున్నాడు! వాడ్ని, వాడ్ని నిలువునా చీల్చినా పాపం లేదు!" అంటూ జాన్సన్ పళ్ళు కొరుకుతూ, వరండాలోంచి దూకబోయాడు.

సమయానికి రాజు వచ్చి అతడ్ని పట్టుకుని వారించాడు.

"తీరానికి చేరాక నీపై విచారణ జరుగుతుంది!" అంటూ కెప్టెన్ వెనక్కి వెళ్ళి తన స్థానంలో కూర్చున్నాడు.

పద్మనాభం మీసాలు మెలితిప్పుతూ చూస్తున్నాడు జాన్సన్ వేపు!

మొత్తానికి పద్మనాభం తన యుక్తిని ఉపయోగించి జాన్సన్పై కక్ష తీర్చుకున్నాడు, అనుకున్నాడు రాజు.

సూర్యుడు పశ్చిమానికి జారుతున్నాడు. బోటుల్లోని వ్యక్తులు ఎవరికి వారే ఆలోచనల్లో మునిగిపోయారు.

"చీకటి పడితే విమానాలు రావుగదూ?" రాజు నిశ్శబ్దాన్ని చీలుస్తూ అడిగాడు.

ఎవరూ అతడి ప్రశ్నకు బదులు చెప్పలేదు.

ఆ పడవలో రాజు, జాన్సన్, మైత్రా, నారాయణన్, కాంతారావు ఉన్నారు. పడవ సగం భాగం అంతా నీళ్ళ డ్రమ్ములతోనూ ఆహారపు ప్యాకెట్లూ, త్రాళ్ళ మోకుల తోనూ, టార్పోలిన్ లతోనూ నిండి వుంది.

"మనం ఏ ప్రాంతంలో వున్నామో గూడా తెలియటం లేదే?" మైత్రా అన్నాడు కాసేపాగి.

వైర్ లెస్ ఆపరేటర్లు ఇద్దరూ విమాన దాడిలో చని పోయారు. కనుకనే మైత్రా ప్రశ్నకు సమాధానం రాలేదు.

కూర్చున్న చోటనే కాళ్ళు బారజాపుకుని నారా యణన్, మైత్రా కళ్ళు మూసుకుని నిద్రపోవటానికి యత్ని స్తున్నారు.

జాన్సన్ రాజు వంక చూశాడు. "నీవూ నిద్దరపో రాదూ? పొద్దుపోతే చలికి నిద్దర పట్టదు!"

"అందరూ నిద్రపోతే ఎవరు వాచ్ చేస్తారు?" రాజు ప్రశ్నించాడు.

"నాకు నిద్ర వచ్చేలా లేదు! నేను 'వాచ్' చేస్తుం టాను నీవు నిద్రపో!"

అక్కడున్న అయిదుగురిలోనూ రాజే సీనియర్. కనుక అతడే ఆజ్ఞలు జారీ చేయాలి.

"విమానాలు కూల్చి అలిసిపోయినట్టున్నావ్! నీకు విశ్రాంతి అవసరం!" పసిబిడ్డని నిద్రకు జోగాడించేవాడిలా అన్నాడు జాన్సన్.

"సరే! నీకు నిద్ర వచ్చినప్పుడు నన్ను లేపు!" అంటూ రాజు మరో మూల చోటు చేసుకుని టార్పాలిన్ మీద వాలిపోయాడు.

కళ్ళు మూసుకుంటే విమానాలు తమ నౌక మీదకు దూసుకు వస్తున్న దృశ్యమూ, అవి తమ కాల్పులకు గురై, సముద్రంలో కూలిపోవడం, మునిగిపోతున్న నౌక ఇదే మెదిలినయ్.

మెల్లగా నిద్రలోకి జారుకొన్నాడు రాజు.

7

తూర్పు రేఖలు తెల్లబారుతున్నయ్. రాజు కళ్ళు తెరిచాడు. తన ప్రక్కనే పడుకుని వున్న మైత్రా, నారాయణన్, కాంతారావులు ఇంకా నిద్రపోతూనే వున్నారు.

అక్కడి వాతావరణంలో ఏదో వెలితి కనుపించింది. రాజు ఉలిక్కిపడి లేచాడు.

తమ బోటుని లాక్కెళుతున్న మోటార్‌బోట్ కనిపించలేదు.

"మోటార్‌బోట్ ఏమయింది?" జాన్సన్ వంక చూస్తూ అడిగాడు రాజు.

జాన్సన్ టార్పాలిన్ పొడవాటి కొయ్యకు కడుతున్నాడు తెరచాప తయారు చేయాలని.

"రాత్రివేళ మోటార్ బోట్‌కీ మన బోట్‌కీ కట్టి వున్న త్రాడు తెగిపోయినట్టుంది. కన్ను పొడుచుకున్నా కనపడని కటిక చీకటిలో మోటార్‌బోట్ వెళ్ళిపోయిన చాలాసేపటికిగానీ ఆ విషయం తెలుసుకోలేకపోయాను" అన్నాడు జాన్సన్ తన పని చేసుకుంటూనే.

"త్రాడు తెగిపోయిందా? లేక ఎవరైనా తెంచారా?"

"అదీ జరిగి వుండచ్చు! ఆ పద్మనాభంగాడి పనే అయి వుంటుంది ఇది. కావాలని తాడు త్రెంచి వుంటాడు. పైగా కోర్టుమార్షల్‌ని తప్పించుకోవటానికి జాన్సనే ఈ పని చేశాడని ప్రచారం చేస్తాడు గూడాను!"

"నిజమే! అసలు వాడ్ని అప్పుడే చంపేసి వుంటే పీడా విరగడైపోయి వుండేది. మన నౌక గురించి శత్రువులకు తెలిసేదీ కాదు. విమానాల దాడి వుండేదీ కాదు, మన నౌక మునిగి వుండేది కాదు. ఇప్పుడు వీటన్నిటికీ కారణం జాన్సన్ అని ఋజువు చేయటానికి ప్రయత్నిస్తాడు వాడు!" అన్నాడు రాజు బాధగా.

జాన్సన్ మాట్లాడలేదు.

అయితే తమ బృందం బంగళాఖాతంలో, నడి సముద్రంలో నిలిచిపోయిందన్న మాట అనుకున్నాడు రాజు. చిన్న పడవలో అయిదుగురు వ్యక్తులు, కేవలం పది గ్యాలన్ల నీరుతో, ఇరవయ్ అయిదు పౌన్ల ఆహార పదార్థాలతో ఎన్నాళ్ళు గడపగలరు?

పైగా శత్రువిమానాలు మళ్ళీ దాడి చేయవచ్చు లేదా పెనుతుఫాను రేగవచ్చు. ఎండవేడి నుంచి రక్షణ లేని పడవలో, ఆకలి దప్పులతో తాము దిక్కులేని చావు చావాల్సిందేనా?

లోగడ కొందరి అనుభవాల్ని విన్నాడు తను. నీడ దొరకని పడవలో నిస్సహాయంగా నావికులు దాహంతో నోరెండి, నాలుక పిడచగట్టుకుపోతుంటే, చావు కోసం ఎదురు చూస్తూ మతి చెడిపోయినవారి కథలు వినే వున్నాడు.

అయినా రాజు స్థైర్యంగా వుండటానికి యత్నించాడు. నిజానికి నిన్న మధ్యాహ్నం నుంచి తను ఆహారం తీసుకోలేదు. నీళ్లు అసలే త్రాగలేదు. చావు బ్రతుకుల మధ్య పోరాటంలో ఆకలి దప్పుల విషయమే మరచిపోయాడు తను.

ఈ భయంకర ప్రయాణం ఎన్నాళ్ళు సాగాలో! లేక ఈ లోపలే శత్రువిమానాలు వచ్చి, బాంబుల వర్షం కురిపించి, తామందర్నీ త్వరితంగా యమపురికి పంపవచ్చు.

తూర్పు దిక్కున అప్పుడే సూర్యుడుదయిస్తున్నాడు' కాంతినీ, వేడినీ కలిగించే అగ్నిగోళం సముద్రంలోంచి పైకి వస్తున్నట్టుగా వుంది సూర్యోదయం.

ఇంకా ఉన్నకొద్దీ వేడి ఎక్కుతుంది వాతావరణం. ఇప్పుడు వీచే చల్లగాలులు మాయమవుతయ్.

టార్పోలిన్‌తో జాన్సన్ తెరచాపను తయారుచేశాడు. తెరచాప స్తంభాన్ని నిలబెట్టాడు. రెండు వైపులా త్రాళ్లు లాగి బలంగా ముడివేశాడు.

"ఈ తెరచాప మూలంగా శత్రువులు మనల్ని తేలికగా గుర్తించరూ?" రాజు అడిగాడు.

"వాళ్ళ గురించి ఆలోచించకు! ఈ తెరచాప వుంటే, గాలి వానలో మనం త్వరగా ఏదైనా తీరాన్ని చేరుకోవచ్చు!"

అప్పటికి నారాయణన్, మైత్రా, కాంతారావు కూడా మేల్కొన్నారు.

నారాయణన్ నాలుగు వైపులా కలయ జూశాడు. "మోటార్ బోట్ ఎక్కడ?" అని అడిగాడు ఆశ్చర్యంగా.

జరిగింది వివరించి చెప్పాడు రాజు. విని ముగ్గురూ నోరెల్లబెట్టారు.

8

"మన పరిస్థితి తల్చుకుంటే నా కడుపులో అగ్ని రగులుకుంటోంది! కాస్త ఏదైనా ఆహారం వెయ్యి రాజూ! ఆహార పదార్థాలు లేవన్న సంగతి తల్చుకుంటేనే, ఆకలి

అతిదారుణంగా వేస్తున్నది!'' కాంతారావు అలమటించాడు.

రాజు ఫుడ్ ప్యాకెట్ ఒకదాన్ని విప్పాడు. అందులోని బిస్కట్లూ, చాకెట్లూ, బీఫ్‌ని అయిదుగురికీ పంచాడు. తలా ఒక కప్పు డ్రమ్‌లోని నీళ్ళు అందరికీ ఇచ్చాడు.

చేతి గడియారం వంక చూస్తూ, ''మధ్యాహ్నం ఒంటిగంటవరకూ మళ్ళీ నీళ్ళుగానీ, ఆహారంగానీ అడగకూడదు'' అన్నాడు రాజు.

అందరికన్నా ముందు కాంతారావే తినేశాడు తన వంతు ఆహారాన్ని.

రాజు అతడి ముఖంలోకి చూశాడు. ''నీ రేషన్ ఒక డొక్కలోకి కూడ రాలేదనుకుంటాను!''

కాంతారావు అవునన్నట్టుగా తలూపాడు.

కాంతారావు అందరిలోకి లావుపాటి మనిషి. అతడ్ని చూసి హేళనగా నవ్వాడు నారాయణన్.

''ఒరేయ్! సైన్సు ఏం చెబుతుందో తెలుసా? పది రోజులు ఆహారం లేకుండా వుండగలిగిన వ్యక్తిలో అసలు ఆకలనేది లేకుండా చచ్చిపోతుందట. అప్పటికీ వాడు బ్రతికే వుంటే, అతడి శరీరం అతడి దేహంలోని కండల్ని కరిగించి ప్రాణాల్ని నిలుపుతుందట. కండలు కూడ కరిగిపోయాక, శరీరం దేహంలోని రక్తాన్ని పీల్చుకుని ఆయుస్సు నిలబెడుతుందట. అప్పటికి అతడెలా వుంటాడో తెలుసా? ఆ స్తిపంజరం మీద చర్మాన్ని కప్పినట్టుగా, ఎముకలూ, చర్మం తప్ప ఒంట్లో వేరే ఏమీ వుండదు. నీ ఒంట్లో కండ బాగా వుంది. ఈ సముద్రం మీద నీవు అందరికన్నా చివరగా ఛస్తావురే!'' నారాయణన్ తన లెక్చరు ముగించి వికటంగా నవ్వాడు మరోసారి.

"నారాయణన్। నీవు నోరు మూసుకో!" రాజు కోపంగా అరిచాడు.

కాంతారావు పిడికిళ్ళు బిగించి నారాయణన్ మీదకు పోబోయాడు.

రాజు అతడ్ని పట్టుకుని ఆపాడు.

"నీ వెధవ విట్స్ వేయటానికి ఇదా సమయం నారాయణన్!" రాజు మందలించాడు.

"ఏదో సరదాగా జోక్స్ వేసి, అందర్నీ ఉల్లాస పరుస్తున్నాను అదీ తప్పా? మాట్లాడకుండా కూర్చుని ఈ భీకర వాతావరణం చూస్తుంటే పదిరోజులకు చచ్చేవాడు ఇప్పుడే రపీమని చస్తాడు."

నారాయణన్ తల క్రింద అరచేతులు పెట్టుకుని కాళ్ళు బారజాపి మళ్ళీ పడుకున్నాడు.

అందరి మనసుల్లో నారాయణన్ మాటలే ప్రతిధ్వనిస్తున్నాయ్. అతడి మాటలు ఎంత ధైర్యస్థుడినయినా పిరికివాడ్ని చేసేలా వున్నయ్.

కాంతారావు అందర్నీ నమిలి మ్రింగేసేవాడిలా చూస్తున్నాడు. మంచినీటి పీపా వంక చూస్తూ పెదవుల్ని నాలికతో తడుముకుని తడి చేసుకుంటున్నాడు.

జాన్సన్ ఒక్కడే కూర్చుని తెడ్లు వేస్తున్నాడు.

9

ఆరోజు, మర్నాడు గూడ శత్రువిమానాలు రాలేదు. తెరచాప కట్టడంవల్లనూ, అందరూ వంతుల ప్రకారం తెడ్లు వేయడం వల్లనూ పడవ ముందుకు సాగుతోంది. అయినా ప్రయాణం రోజు రోజుకు అయిదారు మైళ్ళకన్న మించటం లేదు.

జాన్సన్ అంచెనా ప్రకారం తాము ఇంకా వందమైళ్లు పైగా ప్రయత్నిస్తేగానీ తీరాన్ని చేరలేరు. శాంతి సమయంలో అయితే బంగాళాఖాతంలో ఏవో ప్రయాణపు నౌకలు గానీ, సరకుల్ని చేరవేసే రవాణా నౌకలు గానీ ఎదురుపడి వుండేవే! కానీ యుద్ధ సమయం కావటంవలన నౌకల రాకపోకలు బంద్ అయినయ్.

మధ్య మధ్యలో గాలి ఉధృతంగా వీచేది. ఆ గాలికి అలలు ఎగిరెగిరి పడేవి. పడవలో నీళ్లు చేరుకునేవి. వాటిని తోడి సముద్రంలో పారబోయడం పెద్ద పని అయింది వారికి. గాలి ఎప్పుడు తగ్గిపోతుందా, ఎప్పుడు తాము విశ్రాంతిగా కూర్చుంటామా అని ఆశగా ఆకాశంలోకి చూసేవారు నావికులు.

గాలి తగ్గేసరికి సూర్యతాపం తీవ్రం అయేది. చెమట ఒంటిమీద యూనిఫారం షర్టు విప్పేసి అర్ధనగ్నంగా కూర్చునేవారు, తిరిగీ చెమట పట్టేదాకా.

ఎండ తీవ్రత పెరిగినకొద్దీ దాహం ఎక్కువ అయ్యేది. డ్రమ్ములో నీళ్ళు చూసుకుంటూ కప్పు, అరకప్పు తాగేవారు అందరూ.

రాజు ఆహార పదార్థాలనూ, తాగే నీటినీ పొదుపరిగా పంచసాగాడు. ఇదివరకు అయిదు గంటలకోసారి తినే ఆహారాన్ని ఇప్పుడు ఎనిమిది గంటలకోసారి ఇవ్వసాగాడు. జాన్సన్, రాజు నీళ్ళు చాలా మితంగా తాగి, చాల జాగ్రత్తగా వాడుతున్నారు.

కాంతారావుకి ఎన్ని నీళ్ళు తాగినా దాహం తీరటం లేదు. చివరకు బోటులోంచి వంగి సముద్రపు నీళ్ళను దోసిళ్ళతో అందుకుని తాగటం మొదలెట్టాడు. ఉప్పునీరు

త్రాగటం మూలాన అతడి నోరు ఇంకా త్వరగా తడి ఆరి పోతోంది.

నారాయణన్ కలుగజేసుకుని, కాంతారావు దోసిలి లోని నీళ్ళను చిందగొట్టేశాడు. కోపంతో పళ్ళు కొరుకుతూ, పిడికిళ్ళు బిగించి కాంతారావు నారాయణన్ మీదకు వెళ్ళాడు. నారాయణన్ ప్రక్కకు తప్పుకున్నాడు.

కాంతారావు బోర్లా పడిపోయాడు పడవలో. ముఖానికి దెబ్బ తగలటంతో పెద్దగా అరిచాడు బాధతో.

ఆ రాత్రి నిద్రలోగూడ కాంతారావు "దాహం! దాహం! నీళ్ళివ్వండి! చచ్చిపోతున్నాను!" అని పలవరించాడు.

రాజు అతడి నోటికి కప్పు సగానికి నీళ్ళను అందించాడు.

మరి రెండు రోజులు గడిచినయ్. తీరం జాడలేదు. తమను రక్షించగల నౌకగానీ, భక్షించివేసే శత్రు విమానాలు గానీ తటస్థపడలేదు వారికి.

అయితే గుండె లవిసిపోయే మరో భయానక దృశ్యం ఎదురయింది వారికి.

తమ పడవలాంటి పడవే మరోటి కనుపించింది సముద్రంలో గాలికి అటూ ఇటూ వూగుతూ.

అందులో ఒకే వ్యక్తి వున్నాడు. యూనిఫాంనిబట్టి అతడూ నావికుడే అని అనుకోవాలి.

ఆ వ్యక్తి పడవలో వెల్లకిలా పడి వున్నాడు. అతడి ప్రాణాలు ఎప్పుడో అనంత వాయువుల్లో కలిసి పోయాయి.

జాన్సన్ తమ పడవని ఆ పడవ దగ్గరగా పోనిచ్చాడు. అందులో త్రాగటానికి మంచినీళ్ళు గానీ, తినటానికి ఆహార పదార్థాలు గానీ దొరుకుతాయేమో అని ఆశగా అందరూ పడవలోకే చూశారు.

చనిపోయిన వ్యక్తి గురించి ఎవరూ పట్టించుకునే సితిలో లేరు! ఆ వ్యక్తి శరీరం నల్లగా అయిపోయి, వుబికి వుంది.

పడవ దగ్గరయేకొద్దీ ఆ శవం నుంచి దుర్గంధం రాసాగింది. కాంతారావు నోటికీ, ముక్కుకీ గుడ్డను అదుముకున్నాడు.

జాన్సన్ బోటులోంచి నీళ్ళల్లోకి దూకాడు. ఈదుకుంటూ వెళ్ళి రెండో బోటులోకి ఎక్కాడు. రెండో చేత్తో ముక్కు మూసుకుని, పడవలో అంతా వెదికాడు.

ఆ పడవలో మంచినీరుకానీ, ఆహారపదార్థాలూ కానీ ఏవీ లేవు.

జాన్సన్ ఆకాశంకేసి చూస్తూ బైబిల్‌లోని వాక్యాలేవో ఉచ్చరించాడు. ఆ తర్వాత ఆ శవాన్ని బోటులోంచి ఎత్తి నీళ్ళలోకి జారవిడిచాడు. అతడి దేహానికి ఏదో బరువైనది తగిలించటంతో, ఆ శవం నీళ్ళలో మునిగి పోయింది.

జాన్సన్ ఈదుకుంటూ తిరిగి తమ పడవలోకి వచ్చేశాడు.

కాంతారావు ఇంకా ఆ ఖాళీ పడవ వంకే కన్నార్పకుండా చూస్తున్నాడు, ఇంకా అక్కడ శవం వున్నట్టుగా.

నారాయణన్ తన వంతు కప్పు నీళ్ళను కాంతారావుకియ్యబోయాడు.

కాంతారావు అతడి చేతిమీద కొట్టాడు పిచ్చిగా అరుస్తూ. ఆ రాత్రంతా కూడా కాంతారావు ఏదేదో పిచ్చిగా వాగుతూనే వున్నాడు.

10

జాన్సన్, రాజు ఇద్దరూ కాంతారావుని కనిపెట్టుకుని కూర్చున్నారు. గాలి వాలులో నావ తెడ్లు వేయకుండానే సాగిపోతోంది.

కాంతారావు కళ్ళు మూసుకుని పడుకుని ఉన్నాడు. అతడిలో ఇంకా పసితనపు ఛాయలు మాసిపోలేదు. గడ్డం ఇంకా నూనూగుగానే ఉంది. అతడి స్థితి చూస్తుంటే అందరికీ హృదయం తరుక్కుపోతున్నది.

బోటులో ఇప్పటికి ఆరురోజులు గడిచినయ్.

కాంతారావు బాధగా మూలిగాడు. పడుకున్న చోటు నుంచి కదిలాడు.

జాన్సన్ కప్పుతో నీళ్ళు అందించబోయాడు. కాంతారావు కళ్ళల్లో కోపం తాండవిస్తోంది. విసురుగా జాన్సన్ చేతిని విదిలించి కొట్టాడు. అతడి చేతిలోని నీళ్ళ కప్పు పడవలో ఒక మూలగా వెళ్ళి పడింది.

జాన్సన్ కోపంగా కాంతారావు దవడ మీదకొట్టాడు.

కాంతారావు తిరగబడ్డాడు. పిచ్చివాడికి బలం ఎక్కువంటారు! ఎనుబోతులాంటి పద్మనాభంని ఎలుకలా విదిలించి కొట్టిన జాన్సన్‌తోనే కలియబడ్డాడు కాంతారావు.

వారిద్దరి పెనుగులాడటలో పడవ అటూ ఇటూ ఊగిపోతోంది. రాజు, మైత్రా, నారాయణన్ ముగ్గురూ కలిసి ప్రయత్నించినా వారిద్దర్నీ విడదీయలేకపోయారు.

పైగా అందరూ కమ్ముకుంటుంటే, పడవ సముద్రంలో ఊగులాడుతూ తిరగబడ సాగింది.

నారాయణన్ ఏదో గుర్తుకు వచ్చిన వాడిలా నీళ్ళ డ్రమ్ము దగ్గరకు గబగబ వెళ్ళాడు. డ్రమ్ముచాటునే వున్న కత్తిని తీసుకున్నాడు.

కత్తిని చేతబుచ్చుకుని కాంతారావుని సమీపించాడు, వెనుక వైపునించి.

అతడి ఉద్దేశ్యాన్ని రాజు ముందే గ్రహించాడు. "నారాయణన్! ఆగు! ఆగు!" అని అరిచాడు.

అప్పటికే నారాయణన్ చేతిలో తళతళ లాడే కత్తి కాంతారావు డొక్కల్లో బలంగా దిగబడింది.

"అమ్మో!" అంటూ కాంతారావు ఒరిగిపోయాడు, జాన్సన్ చేతుల్లోకి.

రాజు వెర్రిగా చూస్తూ నిలబడి పోయాడు. మైత్రా గూడ నారాయణన్‌ని హంతకుని చూస్తున్నట్టుగా భయభ్రాంతులతో చూస్తున్నాడు.

కాంతారావు గాయంలోంచి కారిన రక్తంతో పడవలో అడుగుభాగం అంతా ఎర్రబడింది.

నారాయణన్ బొమ్మలాగు నిలిచిపోయాడు. అతడి కళ్ళల్లో నీళ్ళు తిరిగినయ్. అతడి ముఖం జేవురించింది. "అతడ్ని కంట్రోలు చేయటం మనకు సాధ్యం కాదు. అందుకే తప్పనిసరి అయింది!" అని గొణిగాడు.

"అవును! అంతకన్న గత్యంతరం లేదు!" అన్నాడు జాన్సన్ నెమ్మదిగా.

సూర్యాస్తమయం వేళ కాంతారావుని సముద్ర గర్భంలో సమాధి చేశారు.

రాజుకి ఆ రాత్రి కంటిమీద కునుకు లేదు. మనసుఅంతా అల్లకల్లోలంగా ఉంది. నోరు పిడచకట్టుకు పోతోంది. పడవలో నీరు దాదాపు అయిపోయింది.

"మనందరి చావులూ ఒకేరీతిలో రాసి ఉన్నయ్. కాకపోతే ఒకరు ముందూ, మరొకరు వెనుకా! అంతే!... ఈ పరిస్థితుల్లో ఎవరికైనా మతి చెడటం ఖాయం!" అన్నాడు రాజు శూన్యంలోకి చూస్తూ.

11

ఇంకా చీకటి పూర్తిగా తొలగిపోలేదు. రాజు కళ్ళు తెరిచాడు. అతడి దేహంమీద టార్పాలిన్ కప్పారు ఎవరో.

రాజు లేచి కూర్చున్నాడు. జాన్సన్ అతడికి ప్రక్కనే వచ్చి కూర్చున్నాడు.

"ఎలా వుంది ఇప్పుడు!" అని అడిగాడు జాన్సన్.

"కొంచెం నయమే!"

"గత ఎనిమిది గంటలనుంచి నీవు మాంచి నిద్రతీశావ్! నీ వైఖరి చూసి నాకే భయంవేసింది. ఆ నిద్ర పోకపోతే మాత్రం నీవూ కాంతారావులా అయిపోయి వుండేవాడివి!"

"నేనంత పిరికివాడ్ని కాను!" రాజు మొండిగా పలికాడు.

జాన్సన్ ఆప్యాయంగా రాజు వీపు నిమిరాడు, చిఱునవ్వు నవ్వుతూ.

రాజుకి ప్రక్కగా నారాయణన్ ఇంకా నిద్ర పోతున్నాడు.

అందరిముఖాలూ పీక్కుపోయాయి. కళ్ళు గుంటలు పడ్డాయి. ఎముకలు పొడుచుకు వస్తున్నయ్, చర్మాన్ని

నెట్టుకుని. అసిపంజరంమీద గుడ్డ కప్పినట్టుగా, వ్రేలాడుతున్నయ్ అందరి ఒంటిమీది దుస్తులు!

తెల్లవారుజామున కొద్దిగా వర్షం పడింది. డ్రమ్ము మూత తీసి వుంచటంవల్ల అందులో కొంచెంగా వాన నీరు నిలిచింది. జాన్సన్ టార్పాలిన్‌ని పడవమీద గుంటగా పరిచాడు. పడవలో కురిసిన వర్షపునీరు టార్పాలిన్ మీద ప్రోగయింది.

దేవుడి దయవలన ఆ నీళ్ళన్నీ తమకు మరో రెండు రోజులపాటు త్రాగేందుకు సరిపోతయ్!

గటగట మూడుకప్పుల నీళ్ళు త్రాగేశాడు రాజు. పడవలో బిస్కట్లు, చాక్లెట్లూ మరి రెండురోజులకు సరిపోయేలా వున్నయ్. తమ రేషన్‌ని సగానికి తగ్గించుకుంటే, నాలుగురోజులు వస్తుంది ఆ ఆహారం.

జాన్సన్ చాంతాడుని కోసి, పురివిప్పి సన్నని త్రాడుగా చేశాడు. దానికో కొక్కాన్ని తయారుచేసి, చేపలు పట్టటానికి యత్నించసాగాడు.

ఈ ప్రయాణంలో నిద్రపోకుండా, క్షణం విశ్రాంతి తీసుకోకుండా, ఎప్పుడు ఏదో ఒకపని చేస్తూవున్నది జాన్సనే! అతడి జాగరూకతే లేకపోతే తామందరూ ఎప్పుడో సాగరగర్భంలో సమాధి అయిపోయేవారే!

చేపమాంసం, బిస్కట్లూ తిని, నీళ్లు త్రాగాడు రాజు. దేహానికి కొంత సత్తువ వచ్చినట్టుగా వుంది.

తీరం కనుపించని సముద్రంమీదకు చూస్తూ కూర్చున్నాడు రాజు.

ఉన్నట్టుండి రాజు పడవంతా కలయజూశాడు. పడవలో జాన్సన్, తనూ, నారాయణన్ మాత్రమే వున్నారు.

"మైత్రా ఎక్కడ?" రాజు అడిగాడు.

"వెళ్ళిపోయాడు!"

"వెళ్ళిపోయాడా? ఎక్కడకు?"

"ఈ హింస భరించలేక మైత్రా అర్ధరాత్రివేళ పడవ లోంచి దూకేశాడు సముద్రంలోకి!" నారాయణన్ బదులు చెప్పాడు.

రాజు ఇద్దరి వంకా అనుమానంగా చూశాడు.

"నిజమేనా ఇది? లేక కాంతారావుకి మల్లే, అతడ్నీ హత్య చేశారా?"

"లేదు నిజమే! నిన్నంతా అతడూ నీకన్న ఎక్కువగా పలవరించాడు."

"ఈ శుభవార్త చెప్పటానికేనా నన్ను లేపారు!" రాజు కోపంగా చూశాడు.

"అసలే నీరసంగా వున్నావు. ఎక్కువగా మాట్లాడకు!" అన్నాడు నారాయణన్.

"ఏం మాట్లాడితే? అంతగా అయితే నేనూ ఛస్తాను! అంతేగా?"

"నీవు చావటానికి వీల్లేదు! నీకు ఆకలవుతే నా కండల్ని చీల్చి ఇస్తాను తిను! దాహమయితే నా రక్తాన్నిస్తాను త్రాగు!" జాన్సన్ ఆవేశంగా అన్నాడు.

"నాకవేం అక్కర్లేదు! నా మానాన నన్ను నిద్ర పోనీయండి!"

"వద్దు! రాజూ! నిన్ను ఆవహించేది నిద్ర కాదు. 'కోమా'! నిస్సత్తువ ఎక్కువైనకొద్దీ, క్రమేపీ స్పృహ కోల్పోతావ్! అందుకే నీవు నిద్రపోవద్దు. ఒకసారే శాశ్వత నిద్రలోకి జారుకుంటావ్ 'కోమా'లో!"

రాజుకి కళ్ళు మూతలు పడుతున్నయ్. అతడ్ని కుదించి ఊపాడు జాన్సన్. సముద్రపు నీటితో అతడి కళ్ళను కడిగాడు.

రాజుకి పూర్తిగా మెలకువ వచ్చింది. కళ్ళు తెరచి కూర్చుని ఉలిక్కిపడ్డాడు.

12

సుదూరంలో అతడికి తీరంలాంటిది కనుపించింది. కొబ్బరిచెట్లూ, వాటి మధ్యలో చిన్నకుటీరం వున్నయ్.

తను పగటి కలలు కనటం లేదుగదా అని కళ్ళు నులుముకుని చూశాడు రాజు.

ఎందుకనంటే ప్రస్తుత పరిస్థితిలో ఏది కలో, ఏది వాస్తవమో తెలీటంలేదు.

రాజు మిగతా ఇద్దరివంకా చూశాడు. వాళ్ళూ అటు కేసే చూస్తున్నారు, కళ్ళు నులుముకుని మరీ!

మరుక్షణంలో ముగ్గురిముఖాల్లోనూ సంతోషం వెలిసింది.

ఒకర్నొకరు అభినందించుకుంటూ, బోటు అదిరి పోయేలా చిందులు త్రొక్కారు.

తమ బొందిలో ఇంకా ప్రాణం వుండగానే, తాము ఒడ్డుకి చేరగలుగుతున్నారు.

సంతోషంతో గబగబ తెడ్లువేశారు మిత్రులు ముగ్గురూ! పడవ తీరాన్ని చేరుకుంది.

బంగాళాఖాతంలో బంగ్లాదేశ్ కి దూరంగా అదో చిన్న దీవి. దాని విస్తీర్ణం అంతా ఒక చదరపుమైలుకన్న వుండదు.

తీరం అంతా కొబ్బరి చెట్లున్నయ్. ఆ చెట్ల మధ్యలో చిన్న సరస్సు వుంది. దాని ఒడ్డునే కుటీరం వుంది.

పడవలోంచి మోకాలిలోతు నీళ్ళలోకి దూకారు రాజు, జాన్సన్, నారాయణన్! పడవకు లంగరువేసి, ఇసుకలో పరుగెత్తారు, చేతులు, చేతులు పట్టుకుని.

కుటీరం తలుపు తెరిచేవుంది. కానీ లోపల ఎవరూ లేరు!

కానీ స్టవ్ మీద టీ మరుగుతోంది. టేబుల్ మీద ఆహారపదార్థాలు పరిచివున్నయ్.

"ఈ ఇంట్లో ఎవరో వున్నారు. మనల్ని చూసి వాళ్ళెవరోగానీ దాక్కున్నారు!" అన్నాడు రాజు.

"హుఁ! వాళ్ళ ఖర్మ అది! ముందు మనం కడుపారా ఈ ఆహారాన్ని తినేద్దాం! తర్వాత సంగతి తరువాత ఆలోచిద్దాం!" అన్నాడు నారాయణన్.

మరుక్షణం ముగ్గురూ టేబుల్ మీదకు దాడి చేశారు. రోమన్ సామ్రాజ్యాధిపతులు 'ఎరీనా' లో కొద్ది ఆహారాన్ని వుంచి, దాని మీదకు వారంరోజులనుంచి ఆహారం లేకుండా మాడిపోయే బానిసలిద్దర్నీ వదిలేవారట! ఆ పిడికెడు ఆహారంకోసం ఆ ఇద్దరూ ఆగర్భశత్రువుల్లా పోట్లాడుకునేవారట.

అదేవేగంతో ముగ్గురూ టేబుల్ మీది ఆహారాన్ని తినేశారు. కడుపారా తియ్యని నీళ్ళు త్రాగారు. స్టౌమీది టీ త్రాగుతూ విందు చేసుకున్నారు.

మరి కాస్సేపటికి వాళ్ళు కర్తవ్యం గురించి ఆలోచించసాగారు.

ఎక్కడ్నుంచో ట్రాన్సిస్టరులోంచి పాకిస్థాన్ సందేశాలు వస్తున్నయ్.

జాన్సన్, రాజు నారాయణన్ ముగ్గురూ ఆ ఇంటి యజమానికోసం ఇంటిచుట్టూ ప్రదక్షిణం చేసివచ్చారు.

వాళ్ళ కంటికి ఎవరూ కనిపించలేదు. తిరిగి ఇంట్లోకి వచ్చారు.

"ఆఁ! వాడెవడైతే మనకేం! హాయిగా మనం నిద్ర పోదాం!" అన్నాడు నారాయణన్.

"మరీ అంత వెర్రిగా ఆలోచించకు! ఇందులో వున్నది మన శత్రువో, మిత్రుడో తెలుసుకోకుండా ఎలాగ?" అన్నాడు జాన్సన్.

రాజు చెవులు రిక్కించి విన్నాడు. ఆ ఇంటి వాతావరణంలో ఏదో వెలితి తోచింది అతడికి.

"ఇందాకటివరకూ ఈ ట్రాన్సిస్టరు పని చేస్తూనే వుంది. మనం బయటకు వెళ్ళి వచ్చేలోపల, ఎవరో దాన్ని ఆపేశారు" అన్నాడు రాజు ఇల్లంతా కలయ జూస్తూ.

"అంటే ఎవరో ఇంట్లోనే దాక్కుని వున్నారన్న మాట! ఇల్లంతా వెదకండి!" అని అరిచాడు జాన్సన్.

అంతలోనే ఒక మూల కుప్పగా వున్న సామాన్లక్రింద నుంచి ఒక భీకరాకారుడు, పెడబొబ్బ పెడుతూ, బయటకు దూకాడు.

అతడు ఎవరో కాదు పద్మనాభం. అతడి చేతిలో ఎనిమిదంగుళాల కత్తి తెల్లగా తళతళ మెరుస్తోంది.

"నేను ఎలాగో కెప్టెన్ని ఏమార్చి, రాత్రిపూట సముద్రంలోకి దూకి ఈ ద్వీపాన్ని చేరుకున్నాను. కానీ రామేశ్వరం పోయినా, శనేశ్వరం వదలనట్లుగా, మీరు మృత్యువును ఆహ్వానిస్తే వచ్చే అతిధుల్లాగా, నన్ను వెదుక్కుంటూ వచ్చారు!" అని అరిచాడు పద్మనాభం.

మాట పూర్తి అయీ కాకుండానే, పద్మనాభం తనకు చేరువలో వున్న నారాయణన్ని పొడవబోయాడు కత్తితో.

నారాయణన్‌ని ప్రక్కకు త్రోసేసి, తను ముందుకు వచ్చాడు జాన్సన్.

తన మీదకు వస్తున్న పద్మనాభంని చేయి పట్టుకుని మెలిత్రిప్పాడు. మెరుపులా అతడ్ని ఒక రౌండ్ కొట్టించి, లాగి తన రెండు చేతులమీదా అతడ్ని పైకెత్తేశాడు జాన్సన్.

వాలీబాల్‌ను విసిరేసినట్టుగా పద్మనాభంని బలంగా నేల మీదకు విసిరేశాడు జాన్సన్.

క్రిందపడ్డ పద్మనాభం మీదకు దూకాడు జాన్సన్. పద్మనాభం గభాల్న ప్రక్కకు దొర్లాడు.

జాన్సన్ నేలమీద బోర్లా పడ్డాడు. పద్మనాభం నేల మీద నుంచి లేస్తుండగా, జాన్సన్ అతడి భుజాలపై రెండు కాళ్ళూ వేసి, తను నేలమీదే ప్రక్కకు దొర్లాడు. పద్మనాభం అతడి కాళ్ళ మధ్యలో ఇరికి, ఒక పల్టీకొట్టి పడిపోయాడు.

జాన్సన్ అతడి గుండెల మీద కూర్చుని పద్మనాభంని కసిదీరా పిడికిళ్ళతో గుద్దసాగాడు.

"జాన్సన్! అతడ్ని చంపకు! అతడితో మనకు చాలా పని వుంది!" అని అరిచాడు రాజు.

ఏమిటన్నట్టుగా చూశాడు జాన్సన్.

"నీవు విదేశీ గూఢచారివని నావిశాదళంలో ఇతడు వదంతి లేపాడు గదా! నాక గురించి శత్రువులకు రహస్య సమాచారం ఇచ్చి, విమానాల్ని రప్పించింది ఇతడు. అతడి గదిలో దాచుకున్న ట్రాన్స్మిటర్‌ని నీ గదిలో దొరికిందని కెప్టెన్‌కి రిపోర్టు యిచ్చింది పద్మనాభం! అతడి నేరాన్ని అంగీకరింపజేస్తూ, నీవు నిర్దోషివని అతడి నుంచి వ్రాత మూలకమైన వాఙ్మూలం తీసుకుందాం!"

జాన్సన్ కళ్ళు ఆనందంతో మెరిసినయ్. "అదీ నిజమే! కోపంలో నా కంత వూహ తట్టలేదు!" అన్నాడు.

పద్మనాభం నోటంట రక్తం వస్తోంది. అతడు ఆయాసంతో రొప్పుతున్నాడు.

నారాయణన్ కుర్చీ తెచ్చి వేశాడు.

పద్మనాభంని కుర్చీలో కూలేసి, త్రాటితో అతడ్ని కుర్చీకి గట్టిగా బంధించారు.

ఏదో గుర్తుకు వచ్చినవాడిలా రాజు వెనక్కి తిరిగాడు. టేబుల్ మీదున్న ట్రాన్సిస్టర్‌ను ఆన్ చేశాడు.

రేడియోలో స్పెషల్ బులెటిన్ ప్రసారమవుతోంది.

"ఇప్పుడే అందిన శుభవార్త! ఢాకాలోని పాకిస్థాన్ సైన్యాధికారి జనరల్ నియాజీ భారత సైన్యాలకు లొంగిపోయి, తమ ఆయుధాల్ని అప్పగించటం జరిగింది."

రాజు, నారాయణన్ సంతోషంతో ఎగిరిపడ్డారు.

"అన్నట్టు పద్మనాభం దగ్గర ట్రాన్స్మిటర్ వుండాలి కదూ?" అన్నాడు నారాయణన్.

"అవును సుమా!" అంటూ రాజు ఇల్లంతా కలయ వెదికాడు.

ఒక మూలగా నాపరాయి క్రింద నేల మాళిగ వుంది. అందులో ట్రాన్స్మిటర్ దొరికింది.

దాన్ని ఆన్ చేశాడు రాజు. "హలో! నావల్ హెడ్ క్వార్టర్స్! నావల్ హెడ్ క్వార్టర్స్!" అంటూ మెసేజి చెప్పసాగాడు రాజు.

-: ఐపోయింది :-